# క్షమ

క్షమ అంటే ఏమిటి? వెంటనే తక్కుమని ఇంగ్లీషులో జవాబు చెప్పే తెలుగువాళ్ళు ఫర్గివ్‌నెస్ అనీ, ఎక్స్క్యూజ్ చేయటం అనీ అంటే, మిగతా తెలుగువాళ్ళు క్షమాపణ అంటారు. కొంచెం ఓర్పుగా ఆలోచించి చెప్పేవాళ్ళు క్షమ అంటే ఓర్పు అని అర్థం చెబుతారు. క్షమయా ధరిత్రి అంటే ఓర్పులో భూదేవంత అని కదూ అర్థం!

0 0 0

విభజన అంటే ఏమిటి? విభజించటం. విడగొట్టటం. వేరు చేయటం. అంటే వేళ్ళ దగ్గర సాకులు చూపించి, అవాకులూ చెవాకులతో జనాలనీ, వారి నోటి దగ్గర కూడునీ భజనరాయుళ్ళు భుజించటం.

0 0 0

ఏనాడో 1950లలో శ్రీశ్రీగారు ఒక వ్యాసంలో వ్రాసింది నా మనసులో అలా నిలిచిపోయింది.

ఒకతను సముద్రంలో స్నానం చేద్దామని సముద్రపు ఒడ్డుకి వెళ్ళాడుట. స్నానానికి సిద్ధమయాడు కానీ, నీళ్ళల్లో దిగడు. అలా గంటలు గడిచాయి. రోజులు గడిచాయి. కానీ దిగడు.

ఎవరో మీలాంటి వారు 'ఏం బాబూ! ఏమిటి కథ. చల్లకొచ్చి ముంత దాచినట్టు, సముద్ర స్నానానికి వచ్చి ఒడ్డునే నిలబడ్డావ్. స్నానం చేయకుండా వెనకాడుతున్నావ్.' అన్నారుట.

దానికి అతను 'ఏమీ లేదు. సముద్రంలో అలలు వున్నాయి. అవి తగ్గాక స్నానం చేస్తాను!' అన్నాడుట.

మనకి స్వాతంత్రం వచ్చినా ప్రజాక్షేమం కోసం జరగవలసిన వేవీ జరగటం లేదనీ, ప్రజలూ పాలకులూ ఏమీ చేయకుండా చూస్తూ వూరుకుంటున్నారనీ అవేదనతో ఆయన వ్రాశారు. అలా వుంది మన దేశంలో ప్రజల పరిస్థితి అని ఆనాడే ఆయన అన్నారు.

0 0 0

మొగలాయీలు భారతదేశంలో ఎలా ఎక్కడ కుడికాలు పెట్టాలా అని ఆలోచిస్తున్న సమయంలో, మనలో మనం కొట్టుకుని వాళ్ళని నెత్తిన పెట్టుకుని, వాళ్ళు మనల్ని కొల్లగొట్టి మన దేశాన్ని ఆక్రమించుకుంటుంటే చూస్తూ వూరుకున్నాం.

ఏదో వ్యాపారం చేసుకుందామని వచ్చిన బ్రిటిష్ వాడు, పిల్లీ పిల్లీ తగువు కోతి తీర్చినట్టు, మన సంపదని తేరగా ఆరగించటమే కాక రెండొందల ఏళ్ళు మన నెత్తి మీద కూర్చుని కోతి గంతులూ, కుప్పి గంతులూ వేశాడు.

ఇప్పుడు కొందరు రాజకీయ నాయకులూ, ప్రభుత్వమూ కులాల పేరుతో మతాల పేరుతో భాష పేరుతో ప్రాంతీయాల పేరుతో, యధాశక్తి మనల్ని విడగొట్టి విందులు చేసుకుంటున్నారు.

మనం కలిసి వుంటే మరి వాళ్ళకి లేదు సుఖం!

0 0 0

మొన్నీమధ్య ముప్ఫై రెండోసారో, తొంభై మూడోసారో మాయాబజార్ సినిమా చూస్తుంటే దాంట్లో లంబు, జంబు కనపడ్డారు. ఆరోజే ఈ ఎన్నారై కబుర్ల గురించి ఆలోచిస్తున్నానేమో, వాళ్ళు అనాలోచితంగా ఈ కబుర్లలోకి వచ్చేశారు.

ఆనాడు శ్రీశ్రీ వ్రాసింది ఈ లంబు గురించే. లంబుకి ఎంతో ఓపిక. సముద్రంలో అలల తగ్గవు కనుకా, తగ్గలేదు కనుకా ఇప్పటిదాకా స్నానం చెయ్యక పోగా, తనకీ తన దేశానికీ ఎంత హాని జరుగుతున్నా నోరు మెదపలేదు. ఏనాడో ఎవరో హీరో వచ్చి రక్షిస్తార్లే, మనకెందుకు అనవసరంగా నుదుటి మీద ఆ చెమట బిందువులు అని అతని అభిప్రాయం.

మరి జంబు? అతని పూర్తి పేరు వి. భజనజంబు. హిందూ ముస్లిములని విడగొట్టాలంటాడు. హిందువుల్లోనే మీరు ఆ కులం, మేము ఈ కులం అంటాడు. (ఈకలం కాదు, ఈ కులం) ఈ కులంలోనే, మీది చాకులపల్లి మాది మేకులపల్లి అంటాడు ఏకు మేకై. ఇంకా కొంచెం పైకి వెడితే మీరు తెలంగాణ, మేము ఆంధ్రా అంటాడు. ఇంకొంచెం పైకె వెడితే మాది దక్షిణ భారతం, మీది ఉత్తర భారతం అంటాడు. అంతేకాదు మేం టెలుగూస్, మీరు కాదు అంటాడు ఇంగ్లీషులో.

అలాటి లంబు జంబూలు రోజూ లాగానే, ఆ రోజు కూడా చెంబూస్ కేఫ్‌లో వన్ బై టూ కాఫీ త్రాగి, అక్కడే వున్న కిళ్ళీ కొట్టు దగ్గర గప్పాలు కొట్టుతూ నుంచున్నారు.

'మన దేశం పాడయి పోయిందిరా జంబూ. ఎక్కడ చూసినా కుంచాలతో లంచాలూ, ఇవాళ రేపులూ, రేపు హత్యలూ, అరాచికాలూ పరాచికాలూ... ఎవడో హీరో వచ్చి ఆదుకుంటేగానీ మన దేశం బాగుపడదు' అంటున్న లంబు మాటలకి అడ్డం వస్తూ అన్నాడు జంబు.

'అవును. మనదేశం పూర్తిగా పాడయిపోయిందిరా లంబూ. మన కులం కాని నాయకులందరూ ఎన్నికవటం, మన ప్రాంతం కాని వాళ్ళు, మన భాష రాని వాళ్ళూ మన నెత్తి మీదెక్కటం' గీతలు గియ్యటం మొదలుపెట్టాడు జంబు.

'నువ్వు గీతలు గీస్తుంటే గుర్తొచ్చింది. గీతలో కృష్ణుడేమని చెప్పాడు.

సంభవామి యుగే యుగే అని. మళ్ళీ కృష్ణుడు పుట్టాల్సిందే.. వీళ్ళ పని పట్టాల్సిందే' అన్నాడు లంబు.

అప్పుడే అక్కడికి వచ్చాడు డుంబు. అతను కార్టూన్ కారెక్టరే అయినా, ఈ మధ్య బాగా ఎదిగిపోయాడు.

'ఏమిట్రా మీరిద్దరూ ఇక్కడ చేరి దేశంలో వున్న సమస్యలన్నీ తీరుస్తున్నట్టున్నారు. అవును మరిచిపోయాను సుమా. మొన్న ఎన్నికలు జరిగాయి కదా. మీరిద్దరూ మన దేశాన్ని ముందుకు నడిపించే నాయకులకే ఓట్లు వేశారా మరి?' అన్నాడు నవ్వుతూ.

లంబు నవ్వాడు, 'మొన్న నుంచున్న వాడికి హీరో పర్సనాలిటీ ఏ కోశానా లేదు. అందుకే ఈసారి కూడా ఎవరికీ ఓటెయ్యలేదు' అన్నాడు.

జంబు కూడా నవ్వాడు. 'అవునా. వాడు మనవాడు కాదు. వాడికెందుకు ఓటెయ్యటం. అందుకే నేనూ వెయ్యలేదు' అన్నాడు.

డుంబు కూడా నవ్వుతూనే అన్నాడు 'గాంధీగారు కూడా ఆరడుగుల గిరజాల జుట్టు హీరో కాదు. వాళ్ళ కులం వాడూ కాదు. మరి బ్రిటిష్ వాళ్ళు ఆయన గొప్పతనానికి ఓటేసి, దేశం వదిలి వెళ్ళిపోయారేమిటో అమాయకులు'

'ఆయన కాకపోతే ఇంకో హీరో. ఇంకా సరైన వాళ్ళు రావటం లేదు' అన్నాడు లంబు.

'ఆ రోజులు వేరు. ఈ రోజులు వేరు. మనుష్యులందరూ ఒకటి కానట్టే ఇదీనూ' అన్నాడు జంబు.

ఈసారి డుంబు కొంచెం సీరియస్‌గానే అన్నాడు. 'ఒరేయ్. ఈ ప్రజాస్వామ్యంలో మీకు కావలసిన నాయకుల్ని పదవుల్లోకి తెచ్చుకోవటానికీ, అవినీతిగాళ్ళని ఓడించటానికీ మీ చేతిలో వున్న చక్కటి ఆయుధం ఓటు. అది వేయకుండా బడ్డీ కొట్టు దగ్గర నుంచుని ఎందుకురా దేశం పాడయిపోయిందని అరుస్తారు. అంత చక్కటి అవకాశాన్ని వదిలేసి ఇక్కడ పిచ్చి కబుర్లు చెప్పుకోవటానికి మీకు సిగ్గు లేదూ. అంతేకాదు హీరోలు ఎక్కడినించో పుట్టుకు రార్రా. చరిత్ర పుస్తకాలు చదవండి. హీరోలకి ఎక్కడా ప్రత్యేక ప్రసూతి వైద్యశాలలు లేవు. వాళ్ళూ నువ్వు పుట్టినట్టే పుడతారు. కాకపోతే మీలాగా నిద్రపోరు. ఇంకెవడో వచ్చి రక్షిస్తారని ఎదురు చూడరు. తమ ప్రయత్నం వాళ్ళు చేస్తారు. నీ దేశాభివృద్ధిలో నీ పాత్ర ఏమిటి? నీ పని నువ్వు చేయకుండా ఇంకొకళ్ళని తిట్టే హక్కు నీకు లేదు. నీకో విషయం తెలుసా? భారతదేశాన్ని ఆక్రమించుకోవాలంటే భారతీయుల సహాయంతోనే అది సాధ్యం అన్నాడో ఫ్రెంచ్ పెద్ద మనిషి. మీలాంటి వాళ్ళని చూసే అన్నాడాయన ఆ మాట'

లంబూ, జంబూ 'మన డుంబుగాడికి కోపం వచ్చింది' అని సణుక్కుంటూ, మళ్ళీ ఇంకో వన్ బై టు కాఫీ తాగటం కోసం హోటల్ చెంబూస్ కేఫ్‌లోకి వెళ్ళిపోయారు.

0 0 0